క్లుప్తంగా

జగనన్న లేఅవుట్ పరిశీలన



ఆత్మకూరురూరల్: మండలంలోని బోయలచిరివెళ్లలో జగనన్న లేఅవుట్‌ను ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, హౌసింగ్ ఏఈ శరత్ మంగళవారం క్షేత్ర పరిశీలన చేశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను వేగంగా నిర్మించుకునేందుకు చొరవ చూపాలని కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేసి జగనన్న లేఅవుట్‌లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రావూరు వెంకట రత్నాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రేవూరు అంకయ్య, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని చుంచులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు ప్రభుత్వ నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు మంగళవారం అందజేశారు. పాఠశాల హెచ్ఎం సుధాకర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇందూరు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలతో పాటు ప్రతిభావంతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలు ఎంతగానో స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, పెంచలరావు, శివశంకర్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో వినతుల స్వీకారం



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని డీసీపల్లి సచివాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అధికారులు వినతులు స్వీకరించారు. డీసీపల్లి, ఖాన్‌సాహెబ్‌పేట, కోనసముద్రం తదితర గ్రామాల నుంచి 30కి పైగా రెవెన్యూ సమస్యలపై రైతులు లిఖిత పూర్వకంగా తమ సమస్యలపై విజ్ఞప్తులు అందజేశారని రెవెన్యూ అధికారులు గౌస్‌బాషా, శ్రీనివాసులు తెలిపారు. పరిశీలించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

శ్మశాన వాటికకు సీసీ రోడ్డు నిర్మాణం



ఆత్మకూరు: పట్టణంలోని 9వ వార్డులోని హిందూ శ్మశాన వాటికకు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో వార్డుల్లో సచివాలయం నిధులతో అంతర్గత రోడ్ల నిర్మాణం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కొన్నేళ్లుగా శ్మశాన వాటికకు రోడ్డు వసతి లేకపోవడంతో కౌన్సిలర్ కృషితో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆ మార్గంలో పొలాలు కలిగిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కొప్పోలు చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీపీ ఆలూరు కొండమ్మ



అధికారులకు సమస్యలను తెలియజేస్తున్న ప్రజా ప్రతినిధులు

కావలి రూరల్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీపీ ఆలూరు కొండమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కావలి నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దుతూ కావలని కనకపట్నం చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నిత్య శ్రామికుడిలా పని చేస్తున్నారన్నారు. గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా చెరువులు, కాలువలు కట్టలను పటిష్టంగా ఉండేలా చూడాలన్నారు. హౌసింగ్, ఉపాధి హామీ పథకంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి రమేష్‌నాయక్, తహసీల్దారు మాధవరెడ్డి, ఎంపీడీఓ ఏవీ కృష్ణమోహన్, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న భవనం వింజమూరులో ప్రారంభానికి ముస్తాబైన డిజిటల్ లైబ్రరీ. దీని కోసం రూ.16.5 లక్షలు ఖర్చు చేశారు. ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు అన్నీ రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతారు. సాఫ్ట్‌వేరు ఉద్యోగులు తమ స్వగ్రామాలకు వచ్చినప్పుడు ఇక్కడే వర్క్ చేసుకునే అవకాశం ఉంది. ఈ పరిణామం పల్లెలు సైతం ఊహించి ఉండవు. పల్లెలు నాణ్యమైన నెట్‌తో పాటు, నాలెడ్జ్ పెంచుకునే విజ్ఞాన కేంద్రాలుగా మారుతున్నాయి.



- ఈ చిత్రంలో కనిపించే రోడ్డు. వింజమూరులోని జాతీయ రహదారి నుంచి సామాజిక ఆరోగ్యం కేంద్రం వరకు ఏపీఎంఐడీసీ నిధులు ద్వారా రూ.50 లక్షల వ్యయంతో నిర్మించారు. ఇప్పటి వరకు సరైన మార్గం లేక ఇబ్బంది పడుతున్న రోగులకు చక్కని మార్గం.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు భరోసా కేంద్రం వరికుంటపాడు మండలం గణేశ్వరపురం. రూ.20.80 లక్షల వ్యయంతో దీన్ని నిర్మించారు. రైతులకు కావాల్సిన పురుగు మందులు, ఎరువులు ఊర్లోనే తీసుకునే విధంగా రైతు భరోసా కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఇలా అన్నీ పల్లెల్లో నేడు కనిపించే సాధారణ దృశాలు.



- ఈ చిత్రంలో కనిపిస్తున్న గోదామును వరికుంటపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించారు. ఈ గోదాము కోసం రూ.కోటి ఖర్చు చేశారు. ప్రభుత్వం రైతుల వద్ద కొనుగోలు చేసిన వ్యవసాయ ఉత్పత్తులు భద్రపర్చుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం సరఫరా చేసే ఎరువులు కూడా నిల్వ ఉంచుకునేందుకు ఈ గోదాములు ఉపయోగపడుతాయి.

పల్లెల్లో ప్రగతి మెరుపులు

నాలుగేళ్లకు ముందు ఎవరూ ఊహించని అభివృద్ధి పల్లె ముంగిట కనిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ఖజానాలో పట్టుమని రూ.వంద కోట్లు కూడా లేవు. ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకునే క్రమంలో పులి మీద పుట్రలా కరోనా విపత్తు రాష్ట్ర ఆర్థిక వనరులను దెబ్బతీసింది. అయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యదక్షతో రాష్ట్రం నిలదొక్కుకుంది. అభివృద్ధి పనులు జరగడం లేదంటూ టీడీపీ చేస్తున్న దుష్ప్రచారానికి పల్లెల్లో కళ్లకు కనిపిస్తున్న నిలువెత్తు భవనాలే సమాధానం చెబుతున్నాయి.

- మురుస్తున్న పల్లెలు
- వసతుల కల్పనకు రూ.కోట్లు ఖర్చు
- కొత్త భవనాలతో కళకళ
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం



పల్లె పాలనకు దిక్సూచిగా వింజమూరు 4వ గ్రామ సచివాలయం



ఉదయగిరి: టీడీపీ పాలనలో అనేక సమస్యలతో కునారిల్లిన పల్లెలు నేడు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయి. కరువుతో బీటలు వారిన వ్యవసాయ భూములు ముక్కారు పంటలతో పచ్చగా కళకళాడుతున్నాయి. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో అభివృద్ధి, సంక్షేమం పల్లెల్లో ప్రగతి మెరుపులు మెరుస్తున్నాయి. రయ్‌మంటూ దూసుకెళ్లే జాతీయ రహదారి. పాలన సౌలభ్యం కోసం సచివాలయాలు. రైతు సేవలకు రైతు భరోసా కేంద్రాలు. ముంగిట వైద్య కేంద్రాలు. యువతలో విజ్ఞానం పెంపొందేలా డిజిటల్ లైబ్రరీలు. పాడి రైతులకు అండగా పాలశీతలీకరణ కేంద్రాలు. నాడు–నేడు పనులతో రూపు మారిన ప్రభుత్వ పాఠశాలలు. అంగన్‌వాడీ కేంద్రాలు ఇలా.. ప్రతి పల్లె ఒడిలో కొలువు తీరాయి. కేవలం నాలుగేళ్ల పాలనలో (అందులో రెండేళ్ల కరోనా) పల్లెలు అభివృద్ధికి చిరునామాగా మారాయి. ఆయా కార్యాలయాల నూతన భవనాలు నిర్మాణంతో పల్లెలకు నూతన కళ వచ్చింది. గత పాలనలో చిన్న పని అయినా మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సిందే. అంటువంటిది నేడు సొంతూరులోనే గ్రామ సచివాలయ ఉద్యోగులు ద్వారా 545 రకాల సేవలు అందుతున్నాయి. గత అవస్థలకు చెక్ పెడుతూ పాలనలో విప్లవాత్మక మార్పులు ఈ నాగేళ్లలోనే వచ్చాయి.

వేగంగా అభివృద్ధి పనులు

కావలి – దుత్తలూరు వరకు రూ.450 కోట్లతో జాతీయ రహదారి పనులు వేగంగా సాగుతున్నాయి. దుత్తలూరు నుంచి సీతారామపురం వరకు రూ.6 కోట్లతో బీటీ రోడ్డు పనులు పూర్తి చేశారు. అనేక పల్లెల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణం కోసం రూ.25 కోట్లు ఖర్చు చేశారు. బ్రహ్మేశ్వరం నుంచి ఎరుకొల్లు రోడ్డు పనుల రూ.8 కోట్లతో పూర్తి చేశారు. వరికుంటపాడు నుంచి జి.కొండారెడ్డిపల్లి వరకు రూ. 8.23 కోట్లతో పనులు సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన స్థానికంగా నెలకొన్న చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి రూ.5.3 కోట్లతో ఖర్చు చేస్తున్నారు. చాకలికొండ నుంచి తిమ్మారెడ్డిపల్లి వరకు దెబ్బతిన్న తారు రోడ్డు బీటీ పనులు రూ.2 కోట్లుతో పూర్తి చేశారు. ప్రధాని మంత్రి గ్రామ సడక్ యోజనలో ప్రపంచ బ్యాంకు నిధులు రూ.50 కోట్లతో 92 పనులు జరుగుతున్నాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా 8 బీటీ రోడ్డు పనులు రూ.10.75 కోట్లతో జరుగుతున్నాయి. ఇలా నియోజవర్గంలో అనేక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

అభివృద్ధికి చిరునామాలు సచివాలయ వ్యవస్థ వివిధ భవనాలు

పల్లె ముంగిట పాలన కోసం కొత్తగా తెచ్చిన సచివాలయ వ్యవస్థకు సంబంధించి నూతనంగా సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, పాలశీతలీకరణ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు, హెల్త్‌క్లినిక్ భవనాలు పనులు చాలా వరకు పూర్తయ్యాయి. మరికొన్ని చోట్ల పనులు జరుతున్నాయి. వింజమూరు 4వ నంబరు సచివాలయం. రూ.40 లక్షలతో సకల సదుపాయలు సమకూరాయి. ఉద్యోగులు, కార్యార్థులకు వసతులు ఏర్పాటు అయ్యాయి. రైతుల పంటను నిల్వ ఉంచేందుకు 8 చోట్ల మండల కేంద్రాల్లో గొడౌన్లు రూ.10 కోట్లు ఖర్చు చేశారు. నాడు–నేడు పేరుతో నియోజవర్గంలోని 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునికీకరించారు. ఇందు కోసం రూ.10 కోట్లు కేటాయించారు. వింజమూరు, ఉదయగిరిలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రూ.కోట్లు హెచ్చించి ఆధునిక పరికాలు ఏర్పాటు చేశారు. వింజమూరులో రూ.2 కోట్లతో ఐసీడీఎస్ కార్యాలయాన్ని నిర్మించారు. వింజమూరు, ఉదయగిరిలో రూ.2.56 కోట్లతో ఉపఖజానా కార్యాయాలు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

నిర్మాణంలో గ్రామ కొలనలు

ఉదయగిరి ట్యాంక్‌బండ్‌ను గ్రామ కొలనుగా తీర్చిదిద్ది పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.16 కోట్లు కేటాయించారు. పనులు జరుగుతున్నాయి. కలిగిరి, తిమ్మారెడ్డిపల్లి, చాకలికొండ తదితర చెరువులను గ్రామ కొలనుగా మార్చే పనులకు నిధులు మంజూరు అయ్యాయి. వరికుంటపాడు మండలంలో తిమ్మారెడ్డిపల్లి, కొండాపురం మండలం సాయిపేట, దుత్తలూరు మండలం బ్రహ్మేశ్వరంలలో రూ.6 కోట్లతో సీసీ రోడ్లు వేశారు.

ప్రజల ముంగిట పాలన



ఈ ప్రభుత్వంలో పాలన పల్లె వద్దకు వచ్చింది. గత ప్రభుత్వంలో ఏ చిన్న పని కావాలన్నా మండల కేంద్రం చుట్టూ తిరగాల్సి ఉండేది. నేడు అన్నీ వలంటీర్ల ద్వారా ఇంట్లో కూర్చొని ఉంటేనే జరిగిపోతున్నాయి. పైసా ఖర్చు లేకుండా పనులు జరుగుతున్నాయి. గత పాలనకు, ఈ ప్రభుత్వ పాలనకు చాలా తేడా ఉంది.

– శ్రీనివాసరెడ్డి, కొత్తపల్లి

వేగంగా పనులు

నియోజకవర్గంలో 95 సచివాలయ భవనాల్లో 74 పూర్తి కాగా, 14 తుదిదశలో ఉన్నాయి. 95 ఆర్బీకేల్లో 56 పూర్తి కాగా 20 తుది దశలో పనులు ఉన్నాయి. 79 ఆరోగ్య కేంద్రాలకు 40 పూర్తి చేశాం. మిగతావి వివిధ దశలో ఉన్నాయి. డిజిటల్ లైబ్రరీలు 66 మంజూరు కాగా 4 పూర్తి చేశాం. 89 పాలశీతలీకరణ కేంద్రాల్లో 25 పూర్తయ్యాయి. జిల్లాలో సచివాలయ భవనాల నిర్మాణంలో ఉదయగిరి మొదటి స్థానంలో ఉంది. పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు అన్నీ చర్యలు తీసుకుంటున్నాం.

– సుబ్బారెడ్డి, డీఈఈ, పంచాయతీరాజ్, ఉదయగిరి

జగనన్న సురక్షతో అర్హులందరికీ పథకాలు



బుడమగుంటలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష పథకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 1వ వార్డు మద్దూరుపాడు, 17వ వార్డు బుడమగుంటలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం లభిస్తుందని తెలిపారు. వలంటీర్లు ఇంటింటికి తిరిగి పేదల సమస్యలు నమోదు చేయడంతో పాటు సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళతారన్నారు. అన్నీ అర్హతలు ఉన్నా పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి వెంటనే పథకాలు అందించేలా జగనన్న సురక్ష కార్యక్రమంలో చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కావలి మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే ముమ్మరం

అనుమసముద్రంపేట: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమం మండలంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. తహసీల్దారు, ఎంపీడీఓలు రెండు బృందాలుగా ఇంటింటికి వెళ్లి సమస్యలు గుర్తిస్తున్నారు. వలంటీర్లు సైతం ప్రతి ఇంటికి తప్పనిసరిగా సర్వే చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దారు ఏవీ రమణరావు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బాధ్యతగా జగనన్న సురక్ష సర్వే

వరికుంటపాడు: మండలంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీఓ విజయభాస్కర్ రావు తెలిపారు. మంగళవారం సర్వేను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలందించారు. ప్రతి ఇల్లు తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో గుర్తించి వారికి పథకాలు అందించాలన్నారు.

లోపరహితంగా జగనన్న సురక్ష సర్వే

కలిగిరి: గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బాధ్యతగా ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని చేపట్టాలని తహసీల్దార్ శ్రీరామకృష్ణ తెలిపారు. అనంతపురం పంచాయతీలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జగనన్న సురక్ష కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు, పంచాయతీ విస్తరణాధికారి వెలుగోటి మధు, డిప్యూటీ తహసీల్దార్ రాజు, ఏపీఓ శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకట్రావు

బాధ్యతగా జగనన్న సురక్ష నిర్వహించండి

ఆత్మకూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు బాధ్యతగా నిర్వహించాలని పట్టణ జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య తెలిపారు. మున్సిపాలిటీలోని 7, 8, 9 వార్డుల సచివాలయాల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సయ్యద్ నౌషాద్‌బేగం, కొప్పోలు రమాదేవి, అడ్మిన్ సురేంద్ర, సయ్యద్ జమీర్ బాషా పాల్గొన్నారు.

11 రకాల సేవలు ఉచితం

జగనన్న సురక్ష పథకం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రజలకు కావాల్సిన సేవలను సచివాలయాల ద్వారా ఉచితంగా అందించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 3, 4, 21 వార్డుల సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్షపై సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ కోడూరు కౌసల్యమ్మ, కమిషనర్ బి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు నలిశెట్టి శ్రీనివాసులు, కొత్తపల్లి రామయ్య, కొత్తపల్లి శీనయ్య, అబ్దుల్లా పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న సురక్ష సర్వే

ఆత్మకూరురూరల్: కుటుంబాల వారీగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వంద శాతం పూర్తి చేయాలని ఆత్మకూరు తహసీల్దారు లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. మండలంలోని బోయలచిరివెళ్ల సచివాలయం పరిధిలో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని మంగళవారం తనిఖీ చేశారు. లబ్ధిదారులకు అవసరమైన ప్రతి సమస్యను నమోదు చేసుకోవడంతో పాటు వారికి టోకెన్ నంబరు కేటాయించి సచివాలయాల స్థాయిలో నిర్ణయించిన తేదీల్లో ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేయాలన్నారు. ఈఓఆర్‌డీ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి అంకయ్య, వీఆర్‌ఓ హరిబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష

ఉదయగిరి: జగనన్న సురక్ష పక్కాగా నిర్వహించాలని డ్వామా పీడీ వెంకట్రావు తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని నేలటూరు సచివాలయ పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో తెలుసుకోవాలన్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి అందేలా చూడాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.మల్లికార్జునరావు, ఎంఈఓ తోట శ్రీనివాసరావు, ఏపీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంకిత భావంతో సర్వే నిర్వహించాలి

చేజర్ల (సోమశిల): జగనన్న సురక్ష సర్వేను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది అంకిత భావంతో నిర్వహించాలని ఈ కార్యక్రమం ప్రత్యేక అధికారి ఏఓ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అనంతసాగరం మండలంలోని మంచాలపల్లి, ఉప్పలపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష పథకం సర్వేను పరిశీలించారు. సమస్యలు పరిష్కారం కాకుండా ఉంటే వలంటీర్లకు తెలియ జేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

- చేజర్ల మండలంలోని పాడేరు, చిత్తలూరు గ్రామాల్లో వలంటీర్లు సచివాలయ సిబ్బంది జగనన్న సురక్ష పథకం సర్వేను చేపట్టారు. వలంటీర్లు వారికి కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హతలు ఉండి అందకుండా ఉన్న వాటిని గుర్తించి నమోదు చేసుకున్నారు.

ప్రాణహాని ఉందని డీఎస్పీకి ఫిర్యాదు



బాధితుడు ఖాజారంతుల్లా

ఆత్మకూరు: అనంతసాగరానికి చెందిన సయ్యద్ ఖాజా రహంతుల్లా తనకు ఇద్దరి వల్ల ప్రాణహాని ఉందని మంగళవారం ఆత్మకూరు డీఎస్పీ ఎస్ కోటారెడ్డికి ఫిర్యాదు చేశాడు. అనంతసాగరంలో ఖాజారంతుల్లా దుకాణం ఎదుట ఇటీవల అదే ప్రాంతానికి చెందిన షేక్ వలి, మస్తాన్ అనే వారు వాహనాన్ని అడ్డం పెట్టారు. ఈ విషయమై వాగ్వాదం జరగడతో వారు తనపై ఇనుప రాడ్డుతో దాడి చేయడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నానని, అయితే ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు సక్రమంగా కట్టలేదన్నారు. తనపై దాడి చేసిన వలి, మస్తాన్ వల్ల తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బక్రీద్ పండగకు ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు అధికారులు, వైస్ చైర్మన్ సర్దార్

ఆత్మకూరు: ముస్లింల పండగ బక్రీద్ గురువారం జరగనున్న నేపథ్యంలో ప్రార్థనలు నిర్వహించేందుకు ఈద్గా మైదానంలో చేయనున్న ఏర్పాట్లను వక్ఫ్‌బోర్డు అధికారులు, స్థానిక మసీదు, మౌజన్‌లతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో ఈద్గా మైదానంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖుదావన్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్‌తో కలిసి మంగళవారం ఈద్గా మైదానంలో ముస్లింలు కోసం తాగునీటి వసతి, నమాజు చేసుకునేందుకు షామియానాలు, బ్లాంకెట్‌ల ఏర్పాటు, తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ రహీం, జమీర్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో ఐడీ నమోదు



డాక్టర్ శేషారత్నం

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఐడీ నమోదు చేస్తున్నట్లు పేషెంట్లు సహకరించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శేషారత్నం తెలిపారు. ఆస్పత్రిలోని తన చాంబర్‌లో మంగళవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే వారి ఆధార్ కార్డును ఫోన్‌కు అనుసంధానం చేసి ఐడీ నమోదు చేసుకోవాలని సూచించిందన్నారు. ఆస్పత్రికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, దానికి అనుసంధానమైన ఫోన్‌ను వెంట తెచ్చుకోవాలని కోరారు. ఈ ఐడీ నంబరుతో దేశంలో ఏ ఆస్పత్రిలోనైనా వైద్యం చేయించుకునేందుకు పూర్తి వివరాలు నమోదై ఉంటాయన్నారు. ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. గర్భిణులు, బాలింతల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఎక్కువ డెలివరీలు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో జరిగేలా చేస్తున్నట్లు ఆమె వివరించారు. నెలకు 90 నుంచి వంద డెలివరీలు ఆస్పత్రిలో నమోదవుతున్నాయన్నారు. ఫిజియోథెరపి విభాగంలో రోగులకు అందుబాటులో డాక్టర్లు, సిబ్బంది ఉన్నారని మెరుగైన వైద్యం అందుబాటులో ఉందని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శం జగనన్న

- వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంగం: పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంతో పాటు అభివృద్ధి పనులు చేసి ప్రజల మన్ననలను పొందడంలో దేశంలోనే మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తారని వైఎస్సార్‌సీపీ నేత కంటాబత్తిన రఘునాథరెడ్డి అన్నారు. మంగళవారం సంగం ఎంపీపీ కార్యాలయంలో రఘునాథరెడ్డి మాట్లాడుతూ దేశంలోని 29 రాష్ట్రాల్లో ఏ ముఖ్యమంత్రి అందించలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టడంతో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయన్నారు. ఇలాంటి పరిపాలన 14 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించిన టీడీపీ నేతలు చెప్పగలరా అని ప్రశ్నించారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని, ఇప్పటికే రూ.4.50 కోట్లతో మున్సిపల్ బస్టాండ్ నిర్మాణం పూర్తి చేశారన్నారు. సంగం, చేజర్ల, ఏఎస్‌పేట బస్టాండ్ నిర్మాణాలను సైతం సొంత నిధులతో నిర్మించేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు రావుల లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ ఎం దేవసహాయం, జేసీఎస్ కో–ఆర్డినేటర్ ముడి మల్లికార్జున్‌రెడ్డి, సర్పంచ్‌లు కొండయ్య, మానికల చందు, నాయకులు కరిముల్లా, పెరుమాళ్ల రవీంద్రబాబు, వేణు అనుమాలశెట్టి రామారావు, కరుణాకర్, జనార్దన్‌రెడ్డి, కళ్యాణ్, దుగ్గి అనిల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు

ఉదయగిరి: ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో అందించే రిజిస్ట్రేషన్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సబ్ రిజిస్ట్రార్ పి.వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం క్రయ విక్రయదారుల సౌకర్యార్థం ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ–స్టాంపులు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటికే ఈ–స్టాంపుల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఇకపై రిజిస్ట్రేషన్ల కోసం దూర ప్రాంతాలకు వెళ్లి గంటల తరబడి వేచి ఉండే అవసరం లేకుండా సచివాలయల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ అందుబాటులోకి తెచ్చిందన్నారు.

రహదారులకు మరమ్మతులు

- దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు
- రూ.8 లక్షలు సొంత నిధులతో పనులు



ఊచగుంటపాళెం-కాట్రాయపాడు రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ఎంపీపీ ప్రసాద్ నాయుడు

దగదర్తి (కావలి): దాదాపు 15 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని దగదర్తి మండలం ఊచగుంటపాళెం నుంచి కాట్రాయపాడు వరకు ఉన్న రహదారికి మరమ్మతులు చేపడుతున్నారు. దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్ నాయుడు సొంత నిధులు సుమారు రూ. 8లక్షలతో రహదారి మరమ్మతులు ప్రారంభించారు. వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఊచగుంటపాళెం నుంచి చవటపుత్తేడు, తడకలూరు, దగదర్తి, వెలుపోడు, కామినేనిపాళెం మీదుగా కాట్రాయపాడు వరకు 14 కి.మీ. మేర రహదారి మరమ్మతులకు గురైంది. గత ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధిని విస్మరించింది. దీంతో రోడ్డుపై గుంతలతో పాటు అంచులు కోతకు గురవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు కూడా గురవుతుండడంతో ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు చేయడంతో పరిపాలనా అనుమతులు తీసుకునే సరికి కరోనా విపత్తు రావడంతో నిధుల మంజూరు ఆగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం వివిధ గ్రామీణ రోడ్లతో పాటు ప్రధాన జాతీయ, రాష్ట్రీయ, ఆర్‌అండ్‌బీ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యమిచ్చింది. ఈ క్రమంలో ప్రాధాన్యతా క్రమంలో రహదారులను నిర్మిస్తోంది. ఈ నేపథ్యంలో ఎంపీపీ ప్రసాద్‌నాయుడు తన సొంత నిధులు వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. రూ.8 లక్షలకు పైచిలుకు నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించారు. రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చడంతో పాటు రహదారి అంచులు కూడా గ్రావెల్‌తో చదును చేయించారు. దీంతో వాహనచోదకులు, దగదర్తి, వెలుపోడు, కామినేనిపాళెం, తడకలూరు తదితర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.